## ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



యాడికి, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
యాడికి మండల వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు యేసు క్రీస్తు శిలువ, ఆయన త్యాగం, నిరంతర ప్రేమను స్మరిస్తూ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, అగాపే చర్చిల్లో ఉదయం నుంచే ప్రార్థనలు, ఆత్మీయ సందేశాలు సాగాయి. ఆరాధనా మందిరాలను శుభ్రపరిచి, దీక్షాబద్ధంగా వచ్చిన భక్తులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గుడ్‌ఫ్రైడే నేపథ్యంలో 40 రోజులుగా పాటించిన ఉపవాస ప్రార్థనలు, ద్యానం గుడ్ ఫ్రైడే రోజున ముగిశాయి. పెద్దలు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయారు. యాడికి పట్టణమంతా పవిత్రత నిండిన వాతావరణాన్ని సంతరించుకున్న గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి

## కూడేరులో సేవాలాల్ కాలనీ నందు చలివేంద్రం ఏర్పాటు



కూడేరు, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
కూడేరు మండల వ్యాప్తంగా ఎండలు మండుతున్న తరుణంలో అధిక ఉష్ణోగ్రతలు చోటుచేసుకుంటున్న కారణంగా ప్రజలు ఎండ వడదెబ్బకు గురికాకుండా మానవత సేవతో కూడేరు మండల కేంద్రంలోని సేవాలాల్ కాలనీ జాతీయ రహదారి పక్కనే ప్రజల సేవార్థం దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం, చల్లటి మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి చెందిన ఈటిగౌని ఎర్రిస్వామి సహకారంతో చల్లటి మజ్జిగను ఏర్పాటు చేశారు. సేవాలాల్ కాలనీకి చెందిన శంకర్ నాయక్ చలివేంద్రం ఏర్పాటు చేయగా ఈటిగౌని ఎర్రిస్వామి చల్లటి మజ్జిగా అందించడానికి తోడ్పాటునందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, శీనా నాయక్, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలలో భద్రతా ఏర్పాట్లు మధ్య కూడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ను అభినందించిన భక్తులు



కూడేరు, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
కూడేరు మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీశ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పది రోజులుగా నిర్వహిస్తా ఉన్నారు.ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల కన్నా ఈ సంవత్సరం స్వామి బ్రహ్మోత్సవాలకు వేలాదిమంది భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గత పది రోజులుగా కూడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎలాంటి సంఘటనలు జరగకుండా పది రోజులుగా నిర్విరామంగా గట్టి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు సేవలకు అభినందించిన భక్తులు మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పి పూల హారాల, పూల గుచ్చాలు అభినందించి అభినందించారు

## ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి : జేడీఏ

అనంతపురం , ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
అనంతపురం అగ్రికల్చర్: రైతులకు పెట్టుబడుల భారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేడీఏ ముదిగల్లు రవి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అనంతపురంలోని ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో నాచురల్ ఫార్మింగ్ చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) లక్ష్మానాయక్ అధ్యక్షతన వ్యవసాయ, సెర్ఫ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం జేడీఏ ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతుండటం అభినందనీయమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు పెట్టుబడుల భారం తగ్గించి దిగుబడులు పెంచే ఆలోచన చేయాలన్నారు. ఇందుకు గాను పూర్వపు వ్యవసాయ విధానాలకు కాస్త ఆధునికత జోడించి శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగుచేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి సాగు పద్ధతుల్లో భాగంగా పీఎండీఎస్, డాక్టర్ పీఎం, హెచ్ఎం మోడల్స్ కింద వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు చేయించాలన్నారు.




## ఈనెల 6న సీఎం చంద్రబాబు యాడికికి రాక





యాడికి, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
జలధార కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 6న యాడికికి రానున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్, తాడపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మండల తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, యాడికి సిఐ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, గొర్తి రుద్రమ నాయుడు, పరిమి చరణ్, విశ్వనాథ్, గుండా నారాయణస్వామి జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్, తదితర టీడీపీ నాయకులు కలిసి యాడికి మార్కెట్ యార్డ్ పరిసరాలను పరిశీలించి బహిరంగ సభకు అనుకూలమైనదిగా నిర్ణయించారు. వేములపాడు సమీపంలో హెలిప్యాడ్ కు స్థలాన్ని నిర్ణయించారు. పెండేకల్లు రిజర్వాయర్ వద్ద జలధారా కార్యక్రమములో పాల్గొంటారని, సీఎం పర్యటనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేసినట్టు సమాచారం. కార్యక్రమం విజయవంతం చేయడానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు విస్తృతంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మ-రోవైపు ముఖ్యమంత్రి యాడికికి రాబోతున్నారన్న వార్తతో యాడికి ప్రజల్లో ఉత్సాహం నెలకొంది

## ఒక మార్చి నెల ఎన్నో మలుపులు

యాడికి, ఏప్రిల్ 3 (అనంత ప్రభ )
మార్చి 2026 సాధారణంగా 31 రోజులు మాత్రమే ఉన్నా, ఈసారి ప్రపంచాన్ని ఒక్కసారిగా కుదిపేసిన 31 ఘట్టాలుగా నిలిచింది. పండుగల హోరాహోరీ, విద్యార్థుల పరీక్షలు, వాతావరణ మార్పులు , అంతర్జాతీయ ఉద్రిక్తతలు, క్రీడా విజయోత్సవాలు అన్నీ ఒకేసారి ముడిపడటంతో మార్చి నెల ఒక అరుదైన చరిత్ర పుటగా మారిపోయింది. మార్చి మొదటి వారం నుంచే మార్పుల సుడిగాలి ప్రారంభమైంది, 4న హోలీ రంగుల జల్లులు కురిపించినా భూమిపై మాత్రం వేడెక్కే సంకేతాలే. ఎండల తీవ్రత రికార్డులను చెరిపేసి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టగా, మరోవైపు అకాల వర్షాలు, ఆకస్మిక గాలివానలు వాతావరణ శాఖకే ప్రశ్నలు రేకెత్తించాయి. ఎండ వానల సమ్మేళనం మార్చిని పూర్తిగా అనిశ్చితంగా మార్చింది.
పండుగల పరంపర కూడా వరసగా అలరించింది. 18న ఉగాది సందడి, 20న రంజాన్ పవిత్రత, 27న శ్రీరామనవమి శోభ, క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలతో ఆధ్యాత్మిక వాతావరణంగా మారింది. పండుగల సందడి ఒకవైపు వాతావరణ వైపరీత్యాలు మరోవైపు కొనసాగాయి.క్రీడా రంగంలో మాత్రం భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. టి 20 వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకున్న టీమ్ ఇండియా దేశాన్ని పరవశింపజేసింది. కోట్లాది మంది అభిమానులను ఉర్రూతలూగించిన ఈ విజయం మార్చి నెలకు ప్రత్యేక రంగు అద్దింది. అంతర్జాతీయ వేదికపై మాత్రం ఆందోళనల మబ్బులు కమ్ముకున్నాయి. ఇజ్రాయిల్ అమెరికా సంయుక్త దాడులు ఇరాన్‌పై కొనసాగడం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. యుద్ధసంకేతాలు, ఇంధన సరఫరాపై అనిశ్చితి, గ్యాస్ కొరత భయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే ఒత్తిడిలోకి నెట్టాయి. సంబరాల మధ్య ఆందోళనలు, ప్రశాంతత మధ్య పరిణామాలు మార్చిని ప్రపంచ రాజకీయాల గరిష్ఠ ఉద్రిక్తతల నెలగా నిలబెట్టాయి. ఏక కాలంలో పండుగలు, అకాల వర్షాలు, వరల్డ్‌కప్ సంబరాలు, యుద్ధభయాలు,క్యాలెండర్‌లో ఒక నెల మాత్రమే అయినా 2026మార్చి అనుభవాల సుడిగాలి అందుకే చెబుతున్నారు ఒక మార్చి నెల ఎన్నో మలుపులు అని

## అమరావతి కోసం ధర్మం వైపు నిలిచిన షరీఫ్‌కు కృతజ్ఞతలు -- గడ్డ ఫక్రుద్దీన్



ఆదోని , ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఏ. మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌కు టిడిపి ఏపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి గడ్డ ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జరిగిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఈ సందర్భంగా గతంలో జరిగిన సంఘటనలను గుర్తు చేస్తూ, శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లును ప్రవేశపెట్టిన సమయంలో ఎదురైన పరిణామాలను వివరించారు. అప్పటి ప్రభుత్వంలో కొంతమంది మంత్రులు షరీఫ్‌పై చేయి చేసుకోవడం, దూషించడం వంటి ఘటనలు జరిగాయని తెలిపారు.
అయితే అన్ని బెదిరింపులు, ఒత్తిళ్లు వచ్చినా కూడా షరీఫ్ తన అధికారాన్ని వినియోగించి మూడు రాజధానుల బిల్లును ఆమోదించలేదని, ధర్మం వైపు నిలబడ్డారని అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.
అలాగే ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలను, అమరావతి రైతుల కలలను నిలబెట్టిన షరీఫ్‌కు సన్మానం చేయడం తక్కువేనని, అమరావతి అనే రాజధానిని నిలబెట్టినందుకు రాష్ట్ర ప్రజల తరఫున పాదాభివందనాలు తెలుపుతున్నామని గడ్డ ఫక్రుద్దీన్ తెలిపారు

## సెలవు రోజున పాఠశాల నిర్వహణ ఇద్దరు విద్యార్థులకు గాయాలు
## బాలాజీ విద్యానికేతన్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్



ఆదోని , ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
ఆదోని పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహించి విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిన శ్రీ బాలాజీ విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు.
పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఉన్న ఈ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న చరణ్, అరవింద్ అనే విద్యార్థులు తరగతి గదిలో పైకప్పు పెచ్చులూడి తలపై పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
గాయపడిన విద్యార్థులను పరామర్శించిన అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు సంజయ్, కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.
ప్రధానంగా గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ పాఠశాలకు సెలవు ఇవ్వకుండా యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహించడం తీవ్ర నిర్లక్ష్యానికి ఉదాహరణగా పేర్కొన్నారు.
ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు

## చలివేంద్రం .ప్రారంభించిన టిడిపి నాయకులు



శింగనమల, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
సింగనమల.మండలంలో.చిన్న జలాలపురం గ్రామంలో చలివేంద్రం .ప్రారంభించిన టిడిపి నాయకులు సుధాకర ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ ఆదేశాలు మేరకు చిన్న జలాలపురం గ్రామంలో చలివేంద్రం ప్రారంభించి అనంతరం రిబ్బన్ కటింగ్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు
వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రం మజ్జిగ ప్రారంభోత్సవం గొప్ప సేవా కార్యక్రమం అన్నారు. అలాగే మజ్జిగ/నీరు పంపిణీతో మొదలుపెట్టారు ఈ కార్యక్రమం చిన్న జలాపురం గ్రామస్తులు గ్రామ.ప్రజలకు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర ఆది గోపాల్ ధనుంజయ నారాయణస్వామి నరసింహులు ప్రసాద్ రాజు ఆదినారాయణ రాజశేఖర్ , పాల్గొన్నారు

## పార్టీలకు అతీతంగా సర్పంచ్ రాజశేఖర్‌కు ఘన సన్మానం



ఆలూరు , ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాల గ్రామానికి చెందిన సర్పంచ్ ఖాజీపురం రాజశేఖర్ ఐదేళ్లపాటు గ్రామానికి సేవలందించిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం గ్రామస్థులు పార్టీలకు అతీతంగా ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, వార్డ్ సభ్యులు పాల్గొని రాజశేఖర్ సేవలను కొనియాడారు. గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ సన్మాన కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ సమాచారం చట్టం విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు, ఎంపీటీసీ భర్త నారాయణ, గోవిందరాజులు, ఆనందు, వార్డ్ సభ్యులు వీరాంజనేయులు, రంగముని శీను, అలాగే గ్రామస్థులు ప్రతాప్ రాజు, కిష్టప్ప రాజు, ధర్మన్న, అబ్రహాము, వంద్రప్ప, జన్ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై నైట్ విజన్ డ్రోన్ కెమెరాలతో నిఘా....



ధర్మవరం, ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
శుక్రవారం డ్రోన్ కెమెరాలతో పోలీసు శాఖ ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించింది. ధర్మవరం టూ టౌన్, బుక్కపట్నం అటవి ప్రాంతాలలో టూటౌన్ సిఐ రెడ్డప్ప తన సిబ్బందితో నిఘా నిర్వహించారు.
అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు, మరియు ప్రజా భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పలు ప్రాంతాలలో డ్రోన్ ద్వారా అ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, మార్గాలు, మరియు అనుమానాస్పదగా కనిపించే చలనాలను రికార్డు చేయడం జరిగింది.
పోలీసు అధికారుల సమాచారం ప్రకారం, ఇటువంటి డ్రోన్ పర్యవేక్షణలు తరచుగా నిర్వహించడం ద్వారా నేర కార్యకలాపాలను అరికట్టడంలో పెద్దగా ఉపయోగపడుతుందని, ప్రజలు ఎటువంటి అనుమానాస్పద చలనం గమనించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## వైభవంగా గొడుగుల మెరవణి

గాండ్లపెంట , ఏప్రిల్ 3 (అనంత ప్రభ)
మండలంలోని కటారుపల్లిలో జరుగుతున్న విశ్వకవి యోగి వేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గొడుగుల మెరవణి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కటారుపల్లి, గొల్లపల్లి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా గొడుగులను తీసుకెళ్తూ మెరవణి నిర్వహించారు. వేమన భక్తులు స్వామిగొడుగులకు టెంకాయలు సమర్పించారు. కార్యక్రమంలో కేరళ నుంచి వచ్చిన కళాకారుల డ్రమ్స్ వాయిద్య ప్రదర్శన, కథాకళి నృత్యం, కేరళ మిర్రర్ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గొడుగుల మెరవణి తెల్లవారుజామున వరకు కొనసాగింది. దీంతో నాలుగు రోజుల పాటు కొనసాగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

